తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మెకానిక్ షెడ్ లోకి దూసుకుపోయిన కారు....
### త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



రేణిగుంట డిసెంబర్ 15 ప్రభాతవార్త

రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద భాగంలో కారు వెనుక వైపు నుండి బస్సు ఢీకొన డంతో కారు అదుపుతప్పి స్కూటర్ మెకానిక్ షెడ్ లోకి దూసుకుపోయిన సంఘటన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి.వివరాలు ఇలా తిరుపతి నుండి శ్రీకాళహస్తి వెళ్తున్న ఆర్టీసీ సర్వీసు రేణిగుంట ఫ్లైఓవర్ దిగువ భాగంలో టర్నింగ్ తిప్పుకుంటున్న కారును బ్రేక్ ఫెయిల్ అవడంతో వేగంగా ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న మెకానిక్ షెడ్ లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 6 ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే
## ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం
### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:



పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం తోనే ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించిందని, యావత్ తెలుగు జాతికి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్ ఆవరణలో కలెక్టర్ సుమిత్‌కుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడు తూ పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ వెంట నడచి పలు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# “హెల్మెట్...హెల్మెట్”!

**ఓ వైపు చైతన్యం...మరోవైపు వైఫల్యం - పాటించేవారే కరవు!!**





ప్రభాతవార్త-తిరుపతి:

ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులు తమ విధుల్లో భాగంగా బంగ్లాల నుండి బయటకు వస్తే ఎంతదూరం ప్రయాణించినా ఏసి కార్లు...మందీ మార్బలం వెనుక ఉంటారు.అయితే అందుకు భిన్నంగా ఆ ఇద్దరు అధికారులు రోడ్డుప్రమాదాల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ వంతుగా తిరుపతి జిల్లావ్యాప్తంగా హెల్మెట్ ధరించడంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు నడంబిగించారు. తామూ వాహనదారులమే అన్నట్లు సోమవారం ఉదయం తిరుపతి నగరవాసులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ తామూ ఆదర్శంగా ఉన్నామని తలకు హెల్మెట్ ధరించి బుల్లెట్ నడపడం అందరినీ ఆకట్టుకుంది. వారే తిరుపతి జిల్లా పాలనాధికారి ,కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, మరోకరు శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్వయంగాహెల్మెట్ ధరించి బుల్లెట్ నడిపి అందరూ వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని వాహనాలను నడపాలని పెద్ద ఎత్తున చైతన్యం తీసుకువచ్చారు. దీన్ని మరింత కఠినంగా అమలుచేసేలా నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద కూడా సూచికబోర్డులు ఏర్పాటుచేయించారు. నో హెల్మెట్ నో పెట్రోల్ అనే నినాదం రాశారు. అయితే తొలిరోజు సోమవారం తిరుపతి నగరంలో ఇదీ ఏ మాత్రం ఎక్కడా పాక్షికంగా కూడా అమలుజరగలేదు. పైగా ద్విచక్రవాహానాలు నడిపే వాళ్ళందరూ హెల్మెట్ లేకుండా ఏకంగా ఎస్పీ కార్యాలయం మీదుగా ప్రకాశంరోడ్డు, బాలాజీకాలనీ, టౌన్‌క్లబ్ కూడలి, గాంధీరోడ్డు ఇలా ప్రయాణించడం కనిపించింది. సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు హెల్మెట్ ధారణ ఒక తంతుగా మారింది.అయితే పోలీసులు మాత్రం ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్డుప్రమాదాల నియంత్రణతోబాటు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, పాణాలు కాపాడుకోండి అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించడం వల్ల తీవ్రమైన ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని హితవు చేశారు. హెల్మెట్ ధరించడం పోలీసుల కోసం కాదని, పూర్తిగా మీ ప్రాణాల రక్షణ కోసమేనని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. మరోవైపు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనదారులు తలకు హెల్మెట్ ధరించి బండి నడపాలని తిరుమల ట్రాఫిక్ పోలీసులు దణ్ణం పెట్టి వినూత్నరీతిలో స్వాగతం పలికారు.

### భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులు
## అమరజీవి పొట్టి శ్రీరాములు
### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 15 ప్రభాతవార్త :



అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులని, వారి సేవలు చిరస్మరణీయమని, భావితరాలకు ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ డా. ఎస్ .వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ..సోమవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్ లోని సమావేశం మందిరం నందు ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారిని స్మరించుకుంటూ, నేటి రోజును ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అమర జీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుతో కలసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. డిఆర్డిఎ పి డి శోభన్ బాబు, ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ ఏ. ఓ రమేష్, సంబంధిత శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు: ఎస్పీ

చిత్తూరు డిసెంబర్ 15 ప్రభాతవార్త ప్రతినిధి




ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవియైన మహాపురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని ఆయన వర్ధంతి సందర్భంగా, చిత్తూరు జిల్లా ఎస్.పితుషార్ డూడి అన్నారు. జిల్లా ఆర్మ్డ్ రిజర్వు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి తన తుది శ్వాస విడిచి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకున్న మహాపురుషుడు శ్రీ పొట్టి శ్రీరాములని ఎస్పీ తెలిపారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఏ.ఆర్. డి.ఎస్.పి లు చిన్ని కృష్ణ, మహబూబ్ బాష, ఆర్.ఐ చంద్రశేఖర్, మరియు సిబ్బంది పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

### నైపుణ్యాల అభివృద్ధితోనే
## మహిళల ఆర్థిక స్వావలంబన

తిరుపతి యూనివర్సిటీ డిసెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం మూడు నెలల టైలరింగ్ /అప్పేరల్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమము మరియు ఉత్పత్తి కేంద్రాన్ని,మహిళా విశ్వవిద్యాలయ హోమ్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో బేకరీ యూనిట్‌ను మహిళా విశ్వవిద్యాలయ గౌరవనీయులు ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. ఉమ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు /మహిళల ఆర్థిక స్వాలంబనకు నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమని ముఖ్యంగా వస్త్ర రూపకల్పన మరియు టైలరింగ్ వంటి వృత్తి నైపుణ్యాల ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పిస్తాయని, విద్యతో పాటు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం స్వయం ఉపాధి, స్టాటప్ వంటి ఆలోచనలకు అవకాశం కల్పించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు. అదేవిధంగా నేటి సమాజంలో పోషక ఆహార లోపాలు, జీవన శైలి ద్వారా వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఆవరణంలో విద్యార్థులకు మరియు సిబ్బందికి బేకరీ యూనిట్ ద్వారా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు అందించాలనే ఉద్దేశంతో ఈ యూనిట్ ని ప్రారంభించామని తెలియజేశారు.తదుపరి మహిళా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని మాట్లాడుతూ విద్యార్థులలో స్వతంత్ర నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయని ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు సామాజిక,ఆర్థిక సాధికారత సాధించగలరని తెలియజేశారు. మహిళా అధ్యయన కేంద్ర డైరెక్టర్ మరియు స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్మెంట్ డీన్. ప్రొఫెసర్. సి. వాణి మాట్లాడుతూ స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం మరియు ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు టైలరింగ్ టూల్ కిట్ లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ టి.సుధ, ప్రొఫెసర్ అరుణ, ప్రొఫెసర్ బిందు, ప్రొఫెసర్ నీలిమ, టైలరింగ్/ అప్పేరల్ డిజైనింగ్ కోఆర్డినేటర్ మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.కే. హైమావతి, మహిళా అధ్యయన కేంద్ర మరియు విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రయోగశాలల్లో పరికరాలపై
## అవగాహన పెంపొందించుకోవాలి

**రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర రావు పిలుపు,**




తిరుపతి విద్య,డిసెంబర్ 15 ప్రభాతవార్త

ఎస్వీయూలో ల్యాబ్ మెటీరియల్ పై వారం రోజుల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభంఎంతో విలువైన పరిశోధనలకు కేంద్రమైన ప్రయోగశాలల్లో పరికరాల నిర్వహణ గురించి పరిశోధకులు తగిన అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్ రావు కోరారు. ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు ల్యాబ్ మెటీరియల్ పై సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన ప్రారంభ సభ సెనేట్ హాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ విజయ భాస్కరరావు మాట్లాడుతూ.. గొప్ప పరిశోధనా కేంద్రాలు, యూనివర్సిటీల్లో ఎంతో విలువైన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రయోగశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడం ద్వారా మంచి పరిశోధనా ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇందువల్ల ప్రయోగశాలల్లోని పరికరాలను వాటి పనితీరును నిత్యం పరిశీలించుకోవలసి ఉంటుందన్నారు. ఎంతో విలువైన పరికరాలు పనికి రాకుండా పోతే వాటిని మరమ్మత్తుకు ఇస్తే సకాలంలో తిరిగి ఇవ్వక పరిశోధనలు కుంటు పడే అవకాశం ఉంటుందన్నారు. ఇందువల్ల పరికరాలను మరమ్మత్తు చేసుకోవడం గురించి పరిశోధకులకు అవగాహన అవసరం అన్నారు.ముంబైలోని వెస్ట్రన్ రీజినల్ ఇన్స్ట్రుమెంటేషన్ సెంటర్ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏ పరికరాన్ని అయినా క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే పరిశోధకులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏవైనా సమస్యలు పరిశోధన పరికరాలకు సంబంధించి తలెత్తినప్పుడు పరిశోధకులు వాటిని సరి చేసుకోవడానికి అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.ఎస్వీయూ రెక్టార్ ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ.. ఫిజిక్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్వితీయమైన ప్రగతిని సాధిస్తుందని చెప్పారు. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు నేతృత్వంలో నిత్యం వర్క్ షాపులు, సదస్సులు వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ ఫిజిక్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి అన్ని విధాలుగా తోడ్పడుతామని అన్నారు. యూనివర్సిటీ ప్రగతిలో ఫిజిక్స్ విభాగం పనితీరు మేరు శిఖరంగా ఉందని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇటువంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు .ఇందుకు యూనివర్సిటీ అధికార యంత్రాంగం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.సదస్సుకు హాజరైన ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు, ప్రొఫెసర్ హేమ స్వాగత వచనాలు పలికారు.ప్రారంభ సభకు హాజరైన అతిధులను నిర్వాహకులు శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్చంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ ఓవిఎస్ రెడ్డి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాణిపాకం చైర్మన్, ఈఓలు విస్తృత తనిఖీలు

కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు సోమవారం ఆలయ అధికారులతో కలసి సుడిగాలి పర్యటనల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత ఆలయ పుష్కరిణి మార్చు స్థలాన్ని పరిశీలించారు.అలాగే ఆలయ మాఢా వీదులను పరిశీలించారు. అనంతరం బస్టాండు పరిసర ప్రాంతాల్లో తోపుడు బండ్లు రోడ్డుకు అడ్డంగా వుంచి భక్తులకు ఇబ్బంది కలిగించే రీతిలో వ్యాపారాలు సాగిస్తుండడాన్ని గుర్తించి రోడ్డుకు అడ్డంగా వుంచిన తోపుడు బండ్లను అక్కడి నుండి తొలగించాలని ఆదేశించారు. దేవస్థానం వద్ద భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా క్రమపద్ధతిలో బండ్లను వుంచుకుని వ్యాపారాలు నిర్వహించకోవాలని సూచించారు. బస్టాండు ఆవరణలో పరిశుభ్రంగా వుంచాలని ఇందుకు వ్యాపారస్తులు సహకరించాలని తెలిపారు. అనంతరం లడ్డూపోటు, పడితరం స్టోర్‌లను తనిఖీ చేశారు. లడ్డూపోటు నందు భక్తులకు రుచికరమైన నాణ్యమైన ప్రసాదాలను తయారు చేసి అందించాలని చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు సూచించారు.ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ,ఏఈఓ ధనుంజయ, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదిరోజులు అసౌకర్యం లేకుండా సేవలు

**-భక్తుల భద్రతకు సమన్వయంతో విధులు -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**

తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:

పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు టోకెన్లు పొందిన భక్తులు తిరుమలకు చేరుకుంటే భద్రతతోబాటు వారిని క్యూలైన్లలో అనుమతించే విషయంలో సంయమనంతో,సమన్వయంతో సేవలందించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్దేశం చేశారు. తొలిమూడురోజులు దర్శన టోకెన్లు కలిగిన వారిని మాత్రమే ఆలయంలోనికి అనుమతించాలని, లేని వారిని తిరుమలలోనే పలు ఆలయాలు సందర్శించేలా చూడాలన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తులను అనుమతించే విషయంలో వ్యూహాత్మకంగా పనిచేయాలని ఆదేశించారు.



పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసు ,రవాణాశాఖ అధికారులతో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ రామకృష్ణ, అదనపు ఎస్పీ రవిమనోహరచారి.ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడుతో కలసి సోమవారం రాత్రి పద్మావతి విశ్రాంతి భవనంలో సమీక్షించారు.



క్యాంపు కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడుకు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ. 10లక్షల చెక్కును అదజేస్తున్న పాలకొల్లుకు చెందిన దాత కొప్పుల లక్ష్మీ చరిష్మా

## ఆగని గజరాజుల దాడులు
### ఆందోళనలో రైతాంగం





సోమల డిసెంబర్ 15 (ప్రభాతవార్త)

గత వారం రోజులుగా మండల కేంద్రమైన సోమల పరిసర ప్రాంతాల్లో తిష్ట వేసిన గజరాజులు రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రతిరోజు రాత్రి వేళల్లో పంటలపై దాడులు చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. . ఆదివారం రాత్రి ఇరికిపెంట సమీపంలో ఎర్రమెట్ట చింతల గుట్ట బండపై ఆరబోతకు ఉంచిన ధాన్యాన్ని తొక్కి నాశనం చేయడంతో పాటు పది బస్తాల ధాన్యాన్ని ఆరగించేసాయి. రైతు వెంకట్రామ నాయుడు, రామచంద్ర లకు చెందిన ఆరబోసిన ధాన్యం నాశనం అయ్యింది. అలాగే రెండు రోజుల క్రితం మండల పరిషత్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న పొలాలపై ఏనుగులబడి వరి పొలాన్ని కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. నాలుగు ఏనుగులు వారం రోజులుగా పొలాల పై పడి ధ్వంసం చేస్తున్న అటవీ అధికారులు చర్యలు శూన్యమనే చెప్పాలి. వాటిని అడవిలో తరలించేందుకు యువకులు తెలియనితనంతో వాటిని బెదిరించి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. మండలంలో 1990 సంవత్సరం నుంచి ఏనుగు దాడులు జరుగుతూనే ఉన్నాయి. అందులో వాటి బారినపడి అనేకమంది చనిపోయారు. పశువులు చనిపోయాయి. ఆస్తి నష్టం ఎక్కువగానే ఉంది. అయినా ప్రజా ప్రతినిధులు అధికారులు వచ్చి ఇకమీదట ఏనుగుల దాడి జరగకుండా పెన్సింగ్ వేస్తామని ఏర్పాటు చేస్తామని కుంకి ఏనుగులు తెప్పించి వాటిని పారద్రోలతామని చెబుతున్న మాటలు నీటి మూటలు గాని మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది

## కూలటానికి సిద్ధంగా తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయం

### రెండు శాఖల మధ్య సమన్వయ లోపం: అవస్థలో జనం

తొట్టంబేడు డిసెంబర్ 15 ప్రభాతవార్త

లీడ్(తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.గత కొన్ని సంవత్సరాలుగా తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధి నిర్వహించే పరిస్థితి. ఓ వైపు బోలెడన్ని భూ సమస్యలు.గతంలో పని చేసిన అధికారులు సిబ్బంది చేతి వాటంతో ప్రభుత్వ భూములు సంతర్పణ.ఇలా సవాలక్ష సమస్యలను ఎదుర్కొంటున్న కార్యాలయం ఓ చీకటి గృహంలా దర్శనమిస్తుండగా ఇక్కడ పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌న్ వెంటనే కార్యాలయం ఐసిడియస్ కార్యాలయంలోకి మార్చాలని ఆదేశించారు. అయితే ఈ ఆదేశాలు రెండు శాఖల మధ్య వివాదాలకు దారి తీసింది. కలెక్టర్ ఆదేశాలంటూ రెవెన్యూ అధికారులు ఐసిడిఎస్ కార్యాలయంలోకి వారం రోజులు క్రితం మకాం మార్చారు. అయితే ఐసిడిఎస్ అధికారులు తమకేమీ పట్టనట్లు కార్యాలయం ఖాళీ చేయమని మాకు ఆదేశాలు రాలేదంటూ లొల్లి చేస్తున్నారు. దాంతో ఐసిడియస్ అధికారులు భవనాన్ని పూర్తిస్థాయిలో అప్ప చెప్పలేదు. రెవిన్యూ కార్యాలయంలోని డిటి,జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సర్వేర్లు ఐసిడిఎస్ భవనంలోని సమావేశం మందిరంలో తమ స్థానాలను ఏర్పాటు చేసుకున్నారు. సిడిపిఓ భవనంలోని కార్యాలయంలో అధికారులు ఖాళీ చేసి తాళాలు ఇవ్వలేదు.దాంతో తాసిల్దార్, గణనాంక అధికారి, మరికొందరు అధికారులు ఎప్పుడు కూలి పోతుందో తెలియని స్థితిలో పాత రెవెన్యూ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు.ఈ భవనాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ప్రమాదకరస్థితి. ఐసిడిఎస్ అధికారులకు ఫోన్ చేసి తాళాలు ఇవ్వమని రెవిన్యూ అధికారులు అడిగితే తాము బయట మీటింగ్‌లో ఉన్నామని చెబుతున్నట్లు సమాచారం. ఇంతకీ కలెక్టర్ ఆదేశాలుఏమని వచ్చాయి? మరి సిడిపిఓ ఎందుకు ముఖాముఖిగా రెవెన్యూ అధికారులతో చర్చించటం లేదన్నది మండలంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ అంశానికి సంబంధించి రెండు శాఖల మధ్య వివాదాలు చోటు చేసుకున్నపుడు పాలకపక్షం నాయకులు ప్రేక్షక పాత్ర వహించటం గమనించదగ్గ విషయం. భవనం వివాదం రెండు శాఖల అధికారులు దోబూచులాడుతున్నారు. అయితే తొట్టంబేడు సిడిపిఓ కలెక్టర్ ఆదేశాలను బేకాతర్ చేశారా అని గుసగుసలు వినబడుతున్నాయి. అసలు కలెక్టర్ నుంచి ఏం ఆదేశాలు వచ్చాయి ఎందుకు ఐసిడిఎస్ వారిని ఇబ్బంది పెడుతున్నారు అనే అంశం పైన సుదీర్ఘంగా చర్చలు నడుస్తున్నట్లు సమాచారం.దీంతో అర్జీదారులు ఈ రెండు కార్యాలయాలు చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు.




తొట్టంబేడు తహసిల్దార్ కార్యాలయం

## చిరుత దాడిలో మృతి చెందిన పాడి ఆవుకు నష్టపరిహారం చెల్లింపు

**కాణిపాకం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఐరాల మండలంలోని వడ్రాంపల్లె గ్రామ సమీపంలో చిరుతపులి దాడిలో మృతి చెందిన పాడి ఆవుకు సంభదించి బాధిత రైతుకు అటవీశాఖ అధికారులు సోమవారం నష్టపరిహారం చెక్‌ను అందజేశారు. వడ్రాంపల్లె గ్రామానికి చెందిన కిషోర్‌కుమార్ అనే రైతు చెందిన పాడి దూడను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద కట్టివుంచగా గత నెల రోజుల క్రితం చిరుతపులి దాడి చేసి చంపితిన్న విషయం విధితమే. ఈమేరకు బాధిత రైతులకు అటవీశాఖ అధికారులు నష్ట నరిహారం చెక్‌ను పంపిణీ చేశారు. ఈమేరకు అటవీశాఖ ఎఫ్ఆర్వో ఎం.పట్టాబి, డీఆర్వో కరణ్‌సింగ్, ఎఫ్‌బిఓ రెడ్డెప్పలు బాధిత రైతు కిషోర్‌కుమార్‌కు 15 వేల రూపాయలనష్ట పరిహారం చెక్‌ను అందజేశారు.

## ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ – రైతులు పాలీహౌస్‌ల నిర్మాణాలపై మక్కువ చూపాలి !!



**కుప్పం,డిసెంబర్ 15 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యానవన పంటలసాగుకుగాను రైతులకు తగు ప్రోత్సా హం అందిస్తోందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్‌డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు.సోమవారం స్థానికసెంటర్‌ఆఫ్ ఎక్స్ లెన్స్ లో ఉద్యానవన రైతులు, అధికారులతోజరిగినసమావేశంలోఆయన మాట్లాడారు. రైతులు ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పళ్ల తోటల పె ంపకంకు అందించే రాయితీలు వివరించాలన్నారు. అలాగే పాలీహౌస్‌ల నిర్మాణంను రైతులు చేపట్టేలా చూడాలన్నారు. దేశంలోనే తొలిసారి ఇజ్రాయిల్ టెక్నాలజీని గతంలోనే సిఎంచంద్రబాబుకుప్పంలో ప్రవేశపెట్టారన్నారు. రాయలసీమ ప్రాంతాన్నిఉద్యానవన హబ్‌గా మార్చాలనేది సిఎం ఆలోచన అన్నారు. అనంతరం రైతులకు అందిస్తున్న పథకాలపై చర్చించారు. సమావే శంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్‌డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎంరాజు, ఎడిలు పల్లవి, కోటేశ్వరరావు, ఉద్యానవన అధికారి డింపుప్రియ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కెఇసి వైస్‌ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు




**కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ సాంకేతిక విద్య రంగంలో అందిస్తున్నవిశిష్ట సేవలను గుర్తించి దేశ రాజధాని న్యూఢిల్లీలో గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్2025లో అవార్డు అందజేశారు. ఈకార్యక్రమం ఆదివారం జరిగింది.ఈఅవార్డును ప్రముఖ క్రికెటర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత వీరేంద్ర సెహ్వాగ్ చేతుల మీదుగా డా॥ సునీల్ రాజ్ అందుకున్నారు. సా ంకేతిక విద్యలో నాణ్యత ప్రమాణాల పెంపు, విద్యార్థి కేంద్రిత బోధన, సంస్థాగత అభివృద్ధిలో ఆయన చేసిన కృషికి గౌరవంగా ఈ అవార్డు లభించింది. డా॥ సునీల్ రాజ్ నాయకత్వంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, అక్రిడిటేషన్ స్థాయిల్లో ఉత్తమ ప్రమాణాలకు తీసుకెళ్లారు. విదా ్యర్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

## పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం - కమీషనర్



**కుప్పం,డిసెంబర్ 15 ప్రభాతవార్త** అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అమరజీవి వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్‌తో కలసి కమీషనర్ నివాళులు అర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు రుణం తీర్చుకోలేనిదన్నారు.

## అమరజీవికి ఆర్యవైశ్యులచే ఘన నివాళులు



**కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కుప్పం ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో నేతలు ఘన నివాళులు అర్పి ం చారు. స్థానిక అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రాష్ట్రం ఏర్పాటుకోసం 56 రోజుల పాటు ఆమరణ దీక్ష చేపట్టిన అమరజీవి ఆత్మార్పణతోనే తెలుగురాష్ట్రం సిద్ధించిందన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కార్పోరేషన్‌డైరెక్టర్ వేణుగోపాల్, కౌన్సిలర్ సోమశేఖర్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కుప్పం మున్సిపల్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దినకర్, నేతలు రాజేష్, కృష్ణ, ప్రవీణ్, రాజు, దేవా తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు

**శాంతిపురం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని చౌడంపల్లికి చెందిన పురుషోత్తం (40) అనే వ్యక్తికి విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. పురుషోత్తం గత కొంతకాలంగా దండికుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సంతూరు గ్రామంలో ఓ రైతుకుచెందిన వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న నేపథ్యంలో ఈసంఘటన చోటు చేసుకుంది.

## ఘనంగా నాగుల రాళ్ల ప్రతిష్ట

**శాంతిపురం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని రాళ్లబూదుగూరు బిసి హాస్టల్ వద్ద శిథిలదశకు చేరిన నాగులరాళ్లకు మరమ్మత్తులు చేయించి సోమవారం ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన జిఆర్‌దివాకర్‌బాబు అధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంకు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్,కార్మికబోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, నేతలు మణి, రమేష్,చలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపండి సారూ !!

**వి.కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మేజర్ పంచాయతీఅయిన వి.కోట పట్టణంలో పారిశుద్ధ్యం పడకేస్తోంది. మురుగునీటి కాలువలు శుభ్రపరచడంలో పంచాయతీ ఇఒ నిర్లక్ష్యం చూపుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక బాలికలహైస్కూల్, ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఉన్న డ్రైనేజ్ కాలువ మురుగునీరు, వ్యర్థాలు,ముళ్లపొదలతోనిండిపోయింది.ఈప్రాంతం పంచాయతీకార్యాలయంకుకూతవేటుదూరంలోనేఉండడంగమనార్హం.ఇప్పటికైనా ఉన్నతాధికారులుస్పందించిపట్టణంలో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



**పెద్దపంజాణి,డిసెంబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని చిన్నేపల్లి ఉర్దూ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న మహ్మద్ సయ్యద్ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు.ఇటీవల పూతలపట్టులో జరిగిన కాంపిటీషన్‌లో విజయం సాధించాడు. సోమవారం అతన్ని సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్‌రావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు నాజిరాబేగ ం, నజీర్, హెచ్‌ఎం ఆంజనేయులు, రషీద్ అహ్మద్, మహ్మద్ అలీ, పర్వేజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## ఎర్రమన్నుగుంతలు గ్రామంలో డిఎస్పీ విచారణ

– బాంబుస్క్వాడ్‌చే తనిఖీలు !!

**కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని కొటాలూరు పంచాయతీ ఎర్రమన్నుగు ంతలు గ్రామంలో ఆదివారం ఓ పొలంలో పేలుడు సంభవించి చిన్నతంబి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈసంఘటనకు సంబంధించి సోమవారం కుప్పండిఎస్పీ పార్థసారథి గ్రామానికి చేరుకుని సంఘటనపైవిచారణ చేపట్టారు. సంఘటనలో నాటుబాంబు పేలిందా లేక మరే ఇతర పేలుడు పదార్థ ం పేలిందా అనే అంశంగా విచారించారు. అలాగే బాంబుస్క్వాడ్ సైతం సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించింది.కార్యక్రమంలో అర్బన్ సిఐ శంకరయ్య, సర్పంచ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికే షీలీడ్స్ ఆంధ్ర కార్యక్రమం



**రామకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** కుప్పం ప్రాంతంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు కడద్వారా షీలీడ్స్ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారని గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునసా ్వమి, మండల టిడిపి అధ్యక్షుడువెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కార్యాలయంలో వెలుగు సిసిలు, మహిళలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఈకార్యక్రమంలో భాగంగా పదిహేను వేల రుణం అందించడంజరుగుతుందన్నారు. మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో నేతలు పట్ర నారాయణ, కామరాజు నాయక్, గుర్రప్ప, సీతాపతి, రామూర్తి, చలపతి, రామకృష్ణప్ప, రఘు,రవిరెడ్డి, నందారెడ్డి, అవినాష్,మంజునాథ్, ఆదిల్, సురేష్,భాస్కర్, ఆంజనేయప్ప పాల్గొన్నారు.



## కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజలు

**చౌడేపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త** చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి అగ్రహారం వద్దగల శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భగా ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకులచే అభిషేక ప్రియునికి పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణదాత మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అమరజీవి సేవలు మరవలేనివి



**సోమల, డిసెంబర్ 15 ప్రభాతవార్త**ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువుల బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు ప్రతి ఆంధ్రుడు గుర్తించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గౌతమ్ అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## మండల నూతన విద్యాధికారికి స్వాగతం పలికిన సిబ్బంది



**బైరెడ్డిపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** బైరెడ్డిపల్లి మండలానికి నూతన విద్యాశాఖ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన మహబూబ్ బాషా కు స్థానిక ఉపాధ్యాయ బృందం స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.మండలంలో విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి సాయి శక్తుల కృషి చేస్తానని నూతనంగాబాధ్యతలుచేపట్టినమహబూబ్ బాషా తెలిపారు.

## శ్రీరంగపల్లి మునస్వామికి డా.బి.ఆర్.అంబేద్కర్ విశిష్టసేవా రత్న అవార్డు



**చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** గుంటూరు నందు జరిగిన మాల బంధు వనవింధు మాలల ఆత్మీయ కలయిక సమావేశంలో జాతీయ మాల మహానాడు అధ్యక్షులు గొల్ల అరుణ్‌కుమార్ చేతుల మీదుగా ఆల్‌ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరంగపల్లి మునస్వామి డా.బి. ఆర్.అంబేద్కర్ విశిష్టసేవా రత్న అవార్డును అందుకొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా మాలలు, గిరిజనులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసారు. శ్రీరంగపల్లి మునస్వామి మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని, సమస్యల పరిష్కానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం



**వెదురుకుప్పం, నవంబర్ 15 ప్రభాతవార్త :** లోవోల్టేజి సమస్యలు లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి పేర్కొన్నారు. మండలంలోని గొడుగుచింతలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చార్జీ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు, గృహ అవసరాలకు ఎలాంటి లోవోల్టే సమస్యలు లేకుండా విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ సుధాకర్ రెడ్డి,సర్పంచ్ నక్కా బాబు, క్లస్టర్ ఇన్‌చార్జీ చెంగల్రాయుల రెడ్డి, మండల టిడిపి ఉపాధ్యక్షులు మధు, యువనాయకులు మధుసుధాన్‌రావు, నాయకులు బాలాజీ, చంగల్రాయ నాయుడు, లక్ష్మన్ నాయుడు, భాస్కర్ రెడ్డి, విజయ్, గోపి, విక్కీ, జాకబ్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన బిపిమ్‌లు



**సదుం, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మండల పరిధిలోని నడిగడ్డ,గొంగివారిపల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లుగా పనిచేస్తున్న మోనా లిసా, రియాజ్ బాషాలు బదిలీ పై సోమవారం వెళ్లారు. వీరికి సదుం పోస్ట్ ఆఫీస్ లో శాలువాలు కప్పి సన్మానం చేశారు. మోనాలిసా నారాయణ వనం మండలం అరణ్యం కండ్రిగ కు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గా వెళ్ళారు. రియాజ్ బాషా పోస్ట్మాన్ గా ఢిల్లీకి వెళ్లగా వారికి పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్ మాస్టర్ మణి ఆధ్వర్యంలో సన్మానించారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు రెడ్డప్ప రెడ్డి, షాబుద్దీన్, ప్రభుదేవా, స్వాతి, ధనలక్ష్మి,అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు రామయ్య, నాగ భూషణం వెంకటరమణారెడ్డి, చలపతి, నాగరాజా, సిబ్బంది సోనం, ఆయేషా, రమేష్ పాల్గొన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

– అపోలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్

**చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** ప్రపంచం లో టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, దీనిని ఎదుర్కొవ దానికి బలమైన అవగాహన వ్యవస్థ అవసరమని అపోలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ అన్నారు. ది అపోలో యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ సెక్యూరిటీ అండ్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే టాపిక్‌పై చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి విజయవాడ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్ మధుసూధనరావు హాజరై సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యత, ఎఐ ఆధారిత టెక్నాలజీల వినియోగం, సైబర్ నేరాల స్వరూపంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో సైబర్ నేరాల ప్రభావం అధికంగా వుందని, దీనిని ఎదుర్కొవడానికి బలమైన అవగాహన వ్యవస్థ వుండాలన్నారు. విద్యాసంస్థలు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి.జగదీషన్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారం

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలిం చి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికా రులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాల యంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమీషనర్ హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజల నుండి మొత్తం 5 సమస్యలు అందాయి. వీటిలో ప్రజారోగ్య విభాగంకు సంబంధించి నాలుగు సమస్యలు, ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి ఒక సమస్య అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, రెవెన్యూ ఆఫీసర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షలు విరాళం



**కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను వేర్వేరుగా విరాళంగా అందజేశారు. ఈమేరకు చెన్నైకు చెందిన ఎస్ఆర్‌కె ఇన్‌ప్రా అనే భక్తుడు నిత్యాన్నదానంకు లక్ష రూపాయలను, విజయవాడకు చెందిన నాగభార్గవి అనే భక్తురాలు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో వైద్యాధికారి నియామకం



**కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దర్శనార్థం భక్తులకు అత్యవసర సమయాల్లో వైద్య సేవలను అందించ డానికి వీలుగా సోమవారం నుండి వైద్యాధికారిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధాన ఆలయం ముందుభా గంలో వున్న పాత పీఆర్వో కారా ్యలయం భవనంలో ప్రథమ చికిత్సా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో దేవస్థానంకు సంభందించిన ఒక వ్యక్తి, వైద్య ఆరోగ్యశాఖకు సంభందించిన ఒక ఏఎన్ఎం అందుబాటులో వుంటూ భక్తులకు అత్యవసర సమయాల్లో ప్రథమి చికిత్సలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో భక్తులకు మరిన్ని మెరుగైన వైద్యసేవలను అందించడానికి వీలుగా చిత్తూరు విన్ ఆస్పత్రి వారి సౌజన్యంతో వైద్యాధికారిని అందుబాటులో వుంచారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు పాల్గొన్నారు.

## పటేల్‌కు ఘన నివాళులు



**తిరుపతి,డిసెంబర్ 15ప్రభాతవార్త:** స్వతంత్ర భారతదేశంలో ఉపప్రధానిగా, హోంమంత్రిగా పని చేసిన సర్దార్‌వల్లభాయ్‌పటేల్ సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి నాయకులు సూచించారు. వల్లబాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బిజెపి జిల్లా,రాష్ట్ర నాయకులు చంద్రారెడ్డి, గుండాల గోపీనాదరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణిత అవధాని హెచ్ అరుణశివప్రసాద్‌కు ఘనసన్మానం



**చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** ఈనెల 14న విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్ర మహాసభల్లో గణిత అవధాని హెచ్ శివప్రసాద్‌ను రాష్ట్ర కమిటీ ఘనంగా సత్కరించింది. గణితంలో పై విలువలను 3600 దశాంకస్థానాల వరకు విద్యార్థులకు తెలియజేసిందుకు, ప్రపంచ రికార్డులు సాధించినందుకు వ్యక్తిగతంగా రెండు రికార్డులతో పాటు మొత్తం ఏడురికార్డులలో భాగస్వామ్యులైనందుకు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన ఏపి మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఎన్నికల్లో హెచ్ అరుణశివప్రసాద్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యులుగా, ఎం చంద్రమనాయుడును ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, పి స్వప్నను టెక్నికల్ కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన సభ్యులను ఎన్నుకున్నారు. కాగా వీరికి ఏపి ఎంఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షులు పాపుదేశి జయంతి, విజయలక్ష్మీ తదితరులు అభినందనలు తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



**చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యం తో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరపాలక పరిధి 13వ వార్డు మాపాక్షి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాధమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ప్రారంభిం చారు. ప్రాధమిక ఆరోగ్యకేంద్ర ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, త్వరలో మరోరెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలను ప్రారంభిస్తామన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 14విలేజ్ హెల్త్‌క్లినిక్స్, మూడు ప్రాధమిక ఆరోగ్యకేంద్రాల భవనాల ఆధునీకరణ, నిర్మాణానికి రూ. 3.84 కోట్ల నిధులు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. అనంతరం మాపాక్షి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమీషనరు నరసింహప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.సుధారాణి, ఎంహెచ్‌వో డా. లోకేష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ ఝాన్సీ, మాజీ ఎమ్మెల్సీ బిఎన్‌రాజసింహులు, కార్పొరేటర్ బాబు, కూటమి నాయకులు చంద్రప్రకాష్, వెంకటేష్ యాదవ్, ఈశ్వర్, నరేష్, సురేష్, పార్టీనాయకులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



**చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** నగర పరిధి దొడ్డిపల్లెలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్‌శాఖ రూపొందించిన పోస్టర్లను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో విద్యుత్తును ఆదాచేయడంపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, విద్యుత్‌శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, టౌన్ డిఈ ప్రసాద్, విద్యుత్‌శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైద్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సమావేశం



**సోమల డిసెంబర్ 15 (ప్రభాతవార్త)** సోమల మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సమావేశం సోమవారం మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగింది. సోమల పీహెచ్‌సి వైద్యాధికారి జయసింహ ఆధ్వరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఈనెల 21న ఐదు సంవత్సరంలోపు ఉండిన పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేందుకు అందరి అధికారుల సహకారం కావాలని ఆయన అభ్యర్థించారు. తహసిల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. మండలంలో ఐదు సంవత్సరం లోపు పిల్లలు సోమల పీహెచ్సీ పరిధిలో 1308 కందూరు పిహెచ్‌సి పరిధిలో 1134 పెద్దపల్లి పీహెచ్సీ పరిధిలో 1077 మంది పిల్లలకు టీకాలు వేయించే లక్ష ్యంతో పనిచేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ అంగన్వాడి సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణం శివను కలిసిన జనసేన నాయకులు



**పుంగనూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త** ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కళ్యాణం శివ శ్రీనివాస రావును సోమవారం జనసేన నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. మంగళగిరి హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తో పాటు పుంగనూరు ఇంచార్జ్ సిరివేలు చిన్నా రాయల్, పీలేరు ఇన్చార్జి బెజవాడ దినేష్, తంబళ్లపల్లె ఇన్చార్జ్ పోతుల సాయినాథ్ , పుంగనూరు నాయకులు కోలా సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు . పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలో పోలీస్ క్వార్టర్స్ మొత్తం దుస్థితిలో ఉన్నాయని,వాటి స్థానంలో పోలీసులకు అధునాతన క్వార్టర్స్ ఏర్పాటు చేయాలని చిన్న రాయల్ కోరారు.

## మీ సమస్యలకు జనసేన పరిష్కారం




**పుంగనూరు రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త** మీ సమస్యలకు జనసేన పరిష్కారం చూపిస్తుందని, ప్రతివారం జరిగే జనసేన జనవాణి ప్రజా సేవకై ఉద్భవించిన పథకం అని సింగిల్ విండో చైర్మెన్ పగడాల రమణ అన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గాజుల నరేష్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం జనసేనని నిర్వహించారు. మొదలియార్ డైరెక్టర్ మణికంఠ, లీగల్ సెల్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పలు సమస్యల పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాముల హరి, సుబ్బు, రవి,భార్గవ్ నాయకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికేట్లు అందజేయాలి : వి.గురురాజారావు

**పలమనేరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** జనవరి 1 నుండి రిటైర్డ్ ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికేట్లు అందజేయాలని రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు వి.గురురాజారావు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక నార్త్ పాఠశాలలో జరిగిన పలమనేరు నియోజకవర్గం స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసి పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులు 2026 జనవరి 15 లోపు లైఫ్ సర్టిఫికేట్లు జీవన ప్రమాణాల యాప్ ద్వారా అందజేయాలని రాష్ట్ర ఖజానా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారందరూ పెన్షన్లు కొనసాగాలంటే తాము జీవించి వున్నట్లు లైఫ్ సర్టిఫికేట్లు ఫిబ్రవరి 28 లోపు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వివరించారు. నాయకులు గౌస్, జ్ఞానేశ్వర్, ఆర్ముగంశెట్టి, బాలసుబ్రమణ్యం, అక్బర్‌బాషా, నరసింహులు, చంద్రశేఖర్, రమేష్‌బాబు, గురుస్వామినాయుడు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వరుని గుడి హుండీ ఆదాయం రూ.3.60 లక్షలు

***పలమనేరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త:*** పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి హుండీ లెక్కింపు చేపట్టారు. సోమవారం స్థానిక గుడి ఆవరణలో ఆలయ ఇఓ కమలాకర్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు చేపట్టారు. 3 నెలలకు గాను వచ్చిన ఆదాయం మొత్తం రూ.3,60.069గా ఉన్నట్లు తేలింది. ఆయ కమిటీ ఛైర్మన్ మురళీక్రిష్ణ, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు



**చౌడేపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయాలపాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో మంజునాథ్ పెట్రోల్ బంక్ వద్ద ఇటుగా వస్తున్న టూవీలర్‌ను ఎదురుగా మరొక టూవీలర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చౌడేపల్లి సంతగేటుకు చెందిన మోహిత్(22), పుంగనూరు మండలం బండపల్లి గిరి(55)లకు గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ఇరువురి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## వసతి సముదాయాల్లో సౌకర్యాలపై భక్తులతో మాట్లాడిన టిటిడి ఛైర్మన్



**తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కొండపై సామాన్యభక్తులకు ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తున్న యాత్రికుల వసతి సముదాయాల్లో (పిఎసి)మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించి,నాణ్యమైన సేవలందించేలా చూస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. పిఎసి 2ను సోమవారం మధ్యాహ్నం ఛైర్మన్ బిఆర్‌నాయుడు బోర్డు సభ్యులు శాంతారాం, నరేష్, టిటిడి డిప్యూటీ ఈఓ భాస్కర్, ఇఇ వేణుగోపాల్‌తో కలసి తనిఖీలు చేశారు.

## మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. సోమవారం ఆమె గుడ్‌మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సోనియానగర్, వాకాటి నారాయణరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సాధ్యమైనంతవరకు కృషి చేసేందుకు గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట పేరుతో కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ ప్రాంతాల్లోని రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, ఇతర వ్యక్తిగత సమస్యలపై ఎమ్మెల్యేకి విన్నవించారు. ఇందుకు ఆమె స్పందిస్తూ వ్యక్తిగత సమస్యలపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. తక్షణమే వీధిదీపాలు వేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, టిడిపి నేతలు, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పచ్చా మాధవనాయుడు, దంతాల రవి, మేడా సాయినారాయణ, ఎల్.కొండలరావు, కమిషనర్ కె.చిన్నయ్యలు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు ఆధారంగా పంటలు సాగు చేయాలి



తడ డిసెంబర్ 15 ప్రభాతవార్త: మండలం మాంబట్టు కాదలూరు రైతు సేవా కేంద్రం నందు జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ భూసార పరీక్షలు ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను కలిగిస్తాయని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగానే పంటలకు ఎరువులను వాడుకోవాలని అది పర్యావరణానికి మేలు చేయడమే కాక నేల ఆరోగ్యమును కూడా కాపాడుతుంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వరలకేంద్రం తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## స్ఫూర్తిప్రదాత అమరజీవి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అశువులుబాసి అమరజీవిగా నిలిచి అందరికీ స్ఫూర్తి ప్రదాత అయ్యారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కచ్చేరివీధిలో గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎందరో మహానుభావుల త్యాగ నిరతితో భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తే తెలుగు వారికి అమరజీవి పొట్టిశ్రీరాములు ప్రాణార్పణతో ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, టిడిపి నేతలు, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పచ్చా మాధవనాయుడు, దంతాల రవి, మేడా సాయినారాయణ, ఎల్.కొండలరావు, పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన

సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సూళ్లూరుపేట పోలీసు సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి హెల్మెట్ ధారణపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నో హెల్మెట్ నో పెట్రోల్ అనే నినాదంతో పాటు హెల్మెట్ ధారణ వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది మోటార్‌బైక్ ర్యాలీ హెల్మెట్లు ధరించి నిర్వహించారు. పెట్రోల్ బంకుల వద్ద స్వయంగా వెళ్లి అక్కడ పెట్రోల్ పోసుకునే వారిని చైతన్యపరుస్తూ హెల్మెట్లు ధరించాలని, లేనిపక్షంలో పెట్రోలు వాహనాలకు నింపకపోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## సీఎం హామీ నిలబెట్టుకోవాలి

**- రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక**



కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు గూడూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు కోరారు. సోమవారం నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ జడ్పి సిఇఓకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు,లోకేష్ ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన వెంట జిల్లా బిజెపి నాయకులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్‌బికెఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఐటి అండ్ ఏఐ అండ్ డిఎస్ అధ్యాపకురాలు ఎస్.మమతకు తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ సుధా పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు. ప్రిడిక్షన్ ఆఫ్ చైల్డ్ బర్త్ డెలివరీ మోడ్ యూసింగ్ హైబ్రిడ్ ఎన్‌సెయిల్ మిషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆ మేరకు సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావు తదితరులు సహ ఉపాధ్యాయులు మమతను అభినందించారు.

## మార్కెట్‌లోకి స్మైల్ ఎకో ఉత్పత్తులు



శ్రీసిటీ, డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీసిటీలోని స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తులను మొట మొదటగా సోమవారం మార్కె ట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా కంపెనీ ఆవరణ నుంచి ఉత్పత్తుల వాహనాన్ని తరలించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే ఈ కంపెనీ ఈ ఏడాది 5న విఎస్ ఎన్ ఎల్ మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభమైంది. శరవేగంగా ఉత్పత్తులు మొదలుపెట్టి సుమారు 10 లక్షల రూపాయల విలువచేసే తొలి ఉత్పత్తులను విజయవాడకు పంపింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. స్థానికుడు, శ్రీసిటీ ఉద్యోగి నుంచి పారిశ్రామికవేత్తగా మల్లికార్జున పయనం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. స్థానిక యువతకు మరింత ఉపాధి కల్పించే దిశగా కంపెనీ ఇంకా వృద్ధి సాధించాలని ఆకాంక్షి ంచారు.

## స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ



కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: కోట పోలీసుస్టేషన్‌లో సోమవారం గూడూరు డిఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాలని పోలీసులకు ఆదేశించారు. సిబ్బంది కొరతపై పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఆమె వెంట వాకాడు సిఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

## జెఇఇ మెయిన్స్ పరీక్షా కేంద్రం పరిశీలన



కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త: జేఇఇ మెయిన్స్ పరీక్ష జనవరి నెలలో జరగనుంది. ఆ మేరకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ వసతులపై సోమవారం కేంద్ర విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ శంకరయ్య, తహశీల్దార్ కె.జయజయరావులు పరిశీలించారు. ఎన్‌బికెఆర్‌లోని వసతులపై డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అధికారులకు వివరించారు.

## హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందండి : డిఎస్పీ

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని డిఎస్పీ చెంచుబాబు సూచించారు. హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేలా నాయుడుపేటలోని గాంధీమందిరం వద్ద నుంచి పాతబస్టాండ్ సెంటర్ వరకు పోలీసులు నిర్వహించిన బైక్ ర్యాలీని డిఎస్పీ చెంచుబాబు ప్రారంభించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ధరించాలని, లేనిపక్షంలో పెట్రోల్ బంకులో పెట్రోల్ కూడా పట్టరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవికి జనసేన నాయకుల నివాళి



నాయుడుపేట రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు 73 వర్ధంతి సందర్భంగా నాయుడుపేటలో జనసేన పార్టీ నాయకులు నివాళి అర్పించారు. సోమవారం నాయుడుపేట బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నాయకులు అట్ల కృష్ణరావు, బాలుశెట్టి, కుంపటి శ్రీనివాసులు, జ్యోతిష్, వీర మహిళలు రోహిణి,హేమ,సల్మాలు నివాళి అర్పించారు.

## ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్స్ చేయించిన వారికి సన్మానం

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్స్ అనేది ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడేందుకు ఇన్సురెన్స్ చేసే విధంగా ప్రేరేపించిన చంద్రశేఖర్, లలితాదేవి దంపతులను ఏవిఎస్ రెసిడెన్సిలో శుక్రవారం ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్స్ డిఆర్ఎం భవానిశంకర్, బ్రాంచి మేనేజర్ ఎం.లాజర్, సీనియర్ టిఎండి సుబ్రహ్మణ్యంలు ఘనంగా సన్మానించారు.

## అక్షర ఆంధ్రపై స్పందించిన అధికారులు

దొరవారిసత్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఆదివారం వార్తా పత్రికలో అక్షర ఆంధ్ర శీర్షికపై స్పందించిన అధికారులు 2025-26 గాను పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో నిరీక్షణ గుర్తించి అక్షరాశులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం మునిరాజా, సంఘమిత్ర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్స్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి : సిఐ

వెంకటగిరి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సిఐ ఏవి రమణ తెలిపారు. హెల్మెట్లపై అవగాహన కొరకు వెంకటగిరి పట్టణ పురవీధుల్లో పోలీసులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సూచనల మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ లేనిదే ఇకనుండి ఆయిల్ పట్టరని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కామినేని గోపి, ఏడుకొండలు, శివ శంకర్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి, సర్దార్ పటేల్ వర్ధంతి



వాకాడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఎంపిడివో సాయి ప్రసాద్, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ సిబ్బంది, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి ఐఐటి స్పోర్ట్స్ మీట్‌లో... క్రీడాకారుల్లో ఉత్తేజం ఉత్సాహం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త: తిరుపతి ఐఐటిలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ రెండవ రోజు క్రీడాకారుల్లో ఉత్సాహం ఉత్తేజం చోటు చేసుకుంది. చదరంగంలో కాన్పుర్‌కు చెందిన క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. సోమవారం జరిగిన వివిధ పోటీల్లో క్రీడాకారులు విజయం కోసం పరుగులు తీస్తున్నారు. ఇక్కడి ఐఐటిలో జరుగుతున్న 58వ ఇంటర్ క్రీడా పోటీలకు దేశంలోని 23 ఐఐటిల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. టెన్నిస్ లీగ్‌లు ప్రత్యేకాకర్షణగా మారింది. తమ నైపుణ్యాలను క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. టెన్నిస్ లీగ్‌లు జోరుగా హుషారుగా సాగుతున్నాయి. ప్రతి ఐఐటి కోర్టులో ఆధిపత్యం కోసం పోరాడుతున్నారు. టోర్నమెంట్‌లో నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఫైనల్స్ ఉత్కంఠభరితంగా సాగుతాయని పరిశీలకులు భావిస్తున్నారు. చదరంగం పోటీల్లో కాన్పుర్ నాలుగు పాయింట్స్‌తో ముందంజలో ఉండగా ఖరగ్‌పూర్,గౌహతి 3.5పాయింట్లలో పరుగులు తీస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ అధికారిక ప్రకటనలో 60 కిలోల(గ్రూప్ ఏ మరియు బి) 65కిలోల (గ్రూప్‌బి) వెయిట్ లిఫ్టింగ్ విభాగంలలో లిఫ్టర్లు స్నాచ్ మరియు క్లీన్ జెర్క్ విభాగాలలో పోటీ పడ్డారు. 60 కిలోల విభాగం (గ్రూప్ బి 1 వ స్థానం బొంబాయికి చెందిన పియూష్ టైలర్ మొత్తం 148 కిలోల (స్నాచ్ 68 కిలోలు,సిమరియుజే 80కిలోలు) 2వ స్థానం ఖరగ్‌పూర్ ఐఐటికి చెందిన హరి చంద్రప్రసాద్ 3వ స్థానం పాట్నా ఐఐటికి చెందిన డేవిడ్ ప్రతాప్‌లు దక్కించుకున్నారు. గ్రూప్ బి1లో మొదటిస్థానం బొంబాయి ఐఐటికి చెందిన నిఖిలేస్ సింగ్ బిష్ట్ మొదటి స్థానం దక్కించుకోగా రెండవ స్థానం మద్రాస్ ఐఐటికి చెందిన ఆకాష్ పిబి 3వ స్థానం గాంధీనగర్ ఐఐటికి చెందిన శ్రీమాన్ గోవింద దక్కించుకున్నట్లు ప్రకటించారు. ఇతర ఫైనలిస్టులుగా ఖరగ్‌పూర్,ఢిల్లి, జోధ్‌పూర్, దన్‌బాద్, ఇండోర్, తిరుపతి వారణాని,కాన్పుర్‌లు గౌహితిలు ప్రాతినిద్యం వహించినట్లు తెలిపారు. 60కిలోల కేటగిరిలో గ్రూప్ ఏలో మొదటి స్థానం మునాన్షిలియన్ నౌలక్,2వ స్థానాన్ని రోషర్ఐఐటికి చెందిన ఉజ్జల్‌దాస్, 3వ స్థానంఖరగ్‌పూర్‌కు చెందిన సుమిత్‌షిర్వాలు దక్కించుకున్నారు.వచ్చిన అతిథులకు డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ సారథ్యంలో ఆతిథ్యం ఇవ్వటంలో ఎంతో చొరవ చూపుతున్నారు.

## బండారుపల్లిలో రెడ్డివారికి ఘన స్వాగతం



ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్) డిసెంబర్ 15 ప్రభాతవార్త : చిత్తూరు ఉమ్మడి జిల్లా గ్రంథాలయం కమిటీ చైర్మన్‌గా ఎంపికైన రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి స్వగ్రామం బండారుపల్లికి విచ్చేసిన సందర్భంగా సోమవారం పార్టీ నాయకులు గ్రామస్తులు,యువత,మహిళలు పెద్ద ఎత్తున గ్రామ సరిహద్దులు బాణాసంచా కాల్చి గ్రామమంతా పూలు చల్లుతూ బ్యాండ్ మేళాలు మధ్యన గురువారెడ్డిని ఊరేగింపుగా తీసుకు వెళుతూ ప్రతి ఇంటి వద్ద శాలువాలు, పూలమాలలు వేసి సత్కరించి ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు,యువత ఎక్కడెక్కడ గురవారెడ్డిని సన్మానిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన రెడ్డివారి గురువారెడ్డి గత 32 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి అన్నంటే ఉంటూ కష్టపడుతున్నారు మా గ్రామస్తుడు అయినటువంటి గురవారెడ్డిని గుర్తించి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్గా నియమించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్లు శంకర్‌రెడ్డి, దాము తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏర్పేడు పిఎసిఎస్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, పార్టీ నాయకులు తులసి కుమార్, సదాశంకర్ నాయుడు, గ్రామ నాయకులు ధనుంజయులు, వినోద్, బత్తిరెడ్డి,మాధవరెడ్డి,హరి మురళి కుమార్ రవిచంద్ర మునికృష్ణయాదవ్, నాదమునిశెట్టి, శంకర్ తదితరులు పాల్గొని స్వాగతం పలికారు.

## గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి : గంజి మాధవయ్య



పుత్తూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త : గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. సోమవారం రూరల్ మండలం పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో జిల్లాపరిషత్ నిధులతో రూ. 7.5 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం తడుకు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. తడుకు పంచాయతీలో సమగ్ర పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ట్రాక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు రూరల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరవ బాలాజీ, హేమంత్ కుమార్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, నాయకులు అమర్‌నాథ్, హరిప్రసాద్, భాస్కర్‌రెడ్డి, కోట గజపతి, ఆది మందడి, కాంట్రాక్టర్ సుబ్బయ్య, జనసేన గోపి, జగ్గా, రామ్మూర్తి, అమృతవల్లి, ఈశ్వరమ్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్లం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వీరే

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),డిసెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని మహిమాన్విత శైవక్షేత్రంగా గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయం వెలుగొందుతుంది. ఈ ఆలయానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలలకు పాలకమండలిని నియమించారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆది నుంచి ఈ ఆలయం మీద శ్రద్ద వహించారు. మూడు రోజుల క్రితం పాలకమండలి అధికారికంగా ప్రభుత్వం ప్రకటించింది. బోర్డు చైర్మెన్‌గా బత్తల గిరినాయుడు, సభ్యులుగా బాబు, అరుణ, హంస, గీత,రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, రేవతి, నిరంజన్, ఉషలు వెరసి 8 మంది ప్రమాణం చేసారు. వీరిలో ఐదుగురు మహిళలున్నారు.

# గూడూరు డివిజన్

## ఏఎంసీ స్థల పరిశీలన

**- ఏఎంసి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్**



వాకాడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో సర్వే నంబర్ 61లో ఏఎంసికి కేటాయించిన స్థలంను పరిశీలించారు. వాకాడు, నెల్లిపూడి గ్రామాలకు సంబంధించి సర్వే నంబర్లు సుమారు 92 సెంట్లు ఏఎంసి స్థలం ఉన్నది. గతంలో ఈ ప్రాంతంలో ఏఎంసి భవనాలను నిర్మించాలని అప్పటి మాజీ ముఖ్యమంత్రి నేదురు మల్లి జనార్ధన్ రెడ్డి సతీమణి అప్పటి మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, దాంతోపాటు మరో నలుగురు మంత్రులు కలిసి ఏఎంసికి సంబంధించిన భవనాలను నిర్మించాలని శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు ఏఎంసీ సంబంధించిన భవనాల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు, ఏఎంసీ చైర్ పర్సన్ ప్రమీల, వైస్ ఛైర్మన్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి సిబ్బంది కలిసి స్థలం పరిశీలించి ఎమ్మెల్యేకు నివేదికను పంపనున్నట్లు తెలిపారు.

## ద్విచక్ర వాహనదాలకు హెల్మెట్ తప్పనిసరి : సిఐ

దొరవారిసత్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు ఆదేశాలతతో ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశంతో నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వరరావు సోమవారం దొరవారిసత్రం మండల పరిధిలోని టోల్ గేటు పెట్రోల్ బంకు నేషనల్ హైవే సమీపంలోని పలు దగ్గర తనిఖీ చేపట్టారు. ప్రమాదాలను అరికట్టేందుకు హెల్మెట్ తప్పనిసరి అని అన్నారు. పోలిరెడ్డిపాలెం సమీపంలోని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు భారత్ పెట్రోల్ బంక్ నందు తనిఖీ చేపట్టగా హెల్మెట్ లేని పలు ద్విచక్ర వాహనాలపై చలానా విధించారు.

## కృష్ణదాస్‌కి డాక్టరేట్



చిల్లకూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలోని చిల్లకూరు మండలంలోని పొన్నవోలు గ్రామ పంచాయితీలో నిరుపేద కుటుంబంలో జన్మించిన జానపద కళాకారుడు టివి కృష్ణ దాస్‌కి చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ అందించారు. ఆయన జానపద కలలు పండరి భజన కోలాటం అగ్నిగుండాలు అనేక గ్రామాల్లో నిర్వహించారు. పలువురు కళాకారులు గురువు కృష్ణ దాస్‌కి అభినందనలు తెలిపారు.

## సిఐటియు 18వ మహాసభలను జయప్రదం చేయండి



గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: కార్మికుల హక్కుల సాధన కోసం తిరిగి కార్మిక లోకం పోరాటాలకి సిద్ధం కావాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ పట్నంలో జరుగనున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కమిటి పిలుపు మేరకు సోమవారం నాడు తిరుపతి జిల్లా గూడూరులోని సిఐటియు కార్యాలయం వద్ద అన్ని సంఘాలు ఆధ్వర్యంలో సిఐటియు జెండాను, సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయండి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి, బి.వి. రమణయ్య, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి. శివకుమార్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, నాయకులు అడపాల ప్రసాద్, భూలోక మురళి గూడూరు మణి, జి. బాలకృష్ణ, పోలిపోగు బాలాజీ, ఆర్.ఆనంద్, ఎస్.కె.జాన్, కిష్టయ్య, బి.చంద్రయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య!

గూడూరు రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : రూరల్ పరిధిలోని చల్లకాలువ సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో సోమవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు స్థానిక ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

## జిల్లా చేసేవరకు పోరాటం ఆగదు : కంకణాల



గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: గూడూరులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ (లాయర్) ఉమాశంకర్, జనరల్ సెక్రటరీ, ట్రెజరీ కోర్టు బయట గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ గూడూరులో ఉన్న ఖనిజ సంపద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేదు విలువ కట్టలేని సంపద ఉందన్నారు. రాష్ట్ర కాపునాడు కార్యదర్శి కంకణాల పెంచల్ నాయుడు, ఉప్పు రాము, కన్నా రాజేష్,వెంకటేశ్వరరావు, అబ్బు ప్రశాంత్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ దర్శనాలు సేవలపై అవగాహన కల్పించాలి



కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ దర్శనాలు, సేవలను భక్తులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకునే విధంగా వారికి అవగాహన సిబ్బంది అవగాహన కల్పించాలని ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, సెక్యూరిటీ గార్డులు, అర్చకులు, వేదపండితులతో దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు క్యూలైన్లలో నిలబడి నగదు చెల్లించి టిక్కెట్‌లు తీసుకుంటున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం క్యాష్‌లెష్ లావాదేవీలను ప్రవేశపెట్టిందని దీనిపై భక్తులకు అవగాహన కల్పించాల న్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ధనుంజయ, ప్రసాద్, ధనపాల్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే సిఎం చంద్రబాబు ధ్యేయం

**- వైకాపాను వీడి 25 కుటుంబాలు తెదేపాలో చేరిక !!**



రామకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మారుమూల గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు చర్యలుచేపట్టారని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామాపురం తాండాలో పాతిక కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. వీరిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రామాపురంతాండా టిడిపికి కంచుకోట అన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పట్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, కామరాజు నాయక్, నరసింహులు, కృష్ణానాయక్, రఫీ, జయశ ంకర్, వెంకటరామగౌడు, రఘు, జయశ ంకర్, నందారెడ్డి, విజయ్, నాగభూషణ ం, వెంకటేష్, జేయి పాల్గొన్నారు.

## నేడు 196 కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: జిల్లా నుండి ఎంపికైన 196 కానిస్టేబుల్ అభ్యర్థులకు విజయవాడలోని 6వ బెటాలియన్‌లో మంగళవారం సిఎం నారా చంద్రబాబునాయుడు, హోంమంత్రి వంగలపుడి అనితలు నియామకపత్రాలు అందించనున్నారు. అనంతరం ఎస్పీ తుషార్ డూడి విజయవాడకు వెళ్ళే అభ్యర్థుల ప్రయాణ వాహనంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్పీ రాంబాబు, చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంతయ్య, డిటిసి ఇన్స్‌పెక్టర్ అమర నాథ్‌రెడ్డి, ఆర్ఐలు చంద్రశేఖర్, వీరేష్‌లు, డిటిసి ఎస్ఐలు, పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**కుప్పం పురపాలక సంఘం, కుప్పం**

**ప్రకటన** తేది : 15.12.2025

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా కుప్పం పురపాలక సంఘము నందు నేతాజీరోడ్డు-2 నందు ఫ్లవర్ మార్కెట్ ఎదురుగా చిరు వ్యాపారస్తులు వ్యాపారము చేసుకొనుట కొరకు 10x 8 కొలతలు గల 10 కంటైనర్స్‌ను బ్యాంక్ లోనూ ద్వారా రూ.2,00,000/-లు లోను ద్వారా ఇచ్చుట కొరకు ఏర్పాటు చేయడమైనది. కావున ఆసక్తిగల యువతి యువకులు సదరు షాపు రూముల కొరకు తేది 23.12.2025 లోపల దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలియజేయడమైనది.

అర్హతలు : 1. 18 సంవత్సరముల నుండి 60 సంవత్సరముల మధ్యగల యువతీ యువకులై వుండవలెను.
2. చిరు వ్యాపారస్తుల కార్డు కలిగి ఉండలెను.
3 బ్యాంకు లోనుకు అర్హత ఉండవలెను.

**కమిషనర్**
**కుప్పం పురపాలక సంఘం**